
నన్ను గురించి కాదు



నాకు చాలా ఆశ్చర్యం వేసింది చలపతిలో అంత ఆశ్చర్య పడవలసిన దేమయినా ఉందని కాని, చూసి ఆశ్చర్యంలో మునిగిపోవలసినంత విచిత్ర వ్యక్తి కాని కాదు నా ఉద్దేశ్యం

— నెహ్రూ లాంటి వాడిని మా ఊళ్ళో చూడగా తటస్థపడితే ఆశ్చర్య పోవడం సహజం నేను కలలో నయినా అనుకోలేదు ఆ ఊళ్ళో చలపతిని చూస్తానని

"నేనేరా చలపతిని - ఏమిటి అంతగా ఆశ్చర్యపోతున్నావు?" అన్నాడు నన్ను చూసి దగ్గరగా వచ్చిన చలపతి

"సహారా ఎడారిలో మంచి

నీళ్ళుకనబడితే మనకంటినే మనం నమ్మలేము; ఒక్కొక్క సారి నిజాన్ని నిజంగా చూపించినా నమ్మడం చాలా కష్టం...సరే, ఈ ఊళ్ళో దిగబడ్డావు?"

"దిగబడిన వాడివి నువ్వని నీ వాలకం, చేతిలోని సంచి చెపుతున్నాయి. నే నీ ఊరికి పాతకాపు నయానోయ్—అ...నే నీ వంటి అతిథి దేముళ్ళకి ఆతిథ్య మిచ్చే దురదృష్టం పడుతుంటుంది అప్పుడప్పుడూ. పద, ముందు కాఫీతో ప్రారంభిద్దాం మన గృహస్త ధర్మం!"

"గృహస్తువుకూడా అయ్యావా?"

"అహా, మీ అందరి దయవలన!"

"ఖర్మ...."

ఇద్దరం నవ్వుకుంటూ హోటల్లోకి దారి తీశాం.

"ఎన్నాళ్ళయిం దేం?"

"ఏమిటి?"

"అదే—మహారాజు వయి!"

నవ్వాడు చలపతి. "అయిందిలే దగ్గర దగ్గర రెండు సంవత్సరాలు. మనం విడిపోయి మూడేళ్ళు కాలా?"

చలపతి నాతోపాటు విశాఖలో చదువుకున్న తరువాత మా ఇద్దరి దార్లూ వేరయాయి. ఏదో ఉమ్మడి స్నేహితుల ద్వారా కొన్నాళ్ళపాటు వాడి ఉనికి తెలిసింది. కాని తరువా త్తరువాత అటువంటి అవకాశమూ లేకపోయింది. అయినా చదువుకునే రోజుల్లో అనుకుంటూ ఉంటాము — జీవితాంతం అలాగే ఉంటామని. ఆ ఉద్దేశ్యంతోనే విడిపోయేప్పుడు అడ్రసులు కూడా తీసుకుంటాము. రెండు మూడు నెలలపాటు ఉత్తరాలు హోరాహోరీగా సాగి మెల్లగా "ఫేడౌటు" అవుతాయి. ఆ తరువాత సమావేశ స్థలాలు సర్వసాధారణంగా రైల్వే ప్లాటుఫారాలు, సినిమాహాల్సు.

"ఏమిటిరా ఆలోచిస్తున్నావు? — పిడెందుకు తగిలాడా అనా?" నవ్వుతూ అడిగాడు చలపతి.

"ఛలేవాడివే, అలా ఏడవ్వలసిన వాడివి నువ్వు. నేనీ ఊళ్ళో మూడు రోజులపాటు అఘోరిద్దామని వచ్చాను."

"చంపావు పో! అయినా తప్పుతుందా — మూడేళ్ళ స్నేహం తరువాత మూడేళ్ళపాటు విడిపోయిన స్నేహితుడు కనబడి మూడు రోజులే ఉంటానని హామీ ఇచ్చినా ఇంటికి తీసుకుపోకపోతే లోకం ఏమంటుంది?"

నవ్వేలాటకి నేనలా అన్నప్పటికీ నాకు మాత్రం వాడింటికి వెళ్ళడం ఇష్టంలేదు. అసలు వాడింటికే కాదు — మహామహా మా మావయ్యల ఇళ్ళకే వెళ్ళక వాళ్ళచేత గర్వం, అహంకారం అన్న బిరుదులు తగిలించుకున్న వాడిని, అటువంటిది....

"లెదురా . చలపతి, నెనొచ్చింది పూర్తిగా ఆఫీసు పనిమీద ! వాళ్ళు నాకు ఈ మూడు రోజులకి మస్తుగా ఇస్తారు కాబట్టి హోటల్లో దిగుతాను. మన స్వంత డబ్బయివుంటే తప్ప కుండా నీ నెత్తినే ఎక్కేవాడిని — ఆ ఆముదమేదో నీకే కానివ్వమని" అన్నాను సీరియస్‌గా ఎలాగయినా వాడిని ఒప్పించాలన్న తాపత్రయంతో

"ఏడిశావులేవోయ్ — ఇవ్వాళ నువు రావడం మానేసినా రేపు నేను మీ ఊరు వస్తే మాత్రం వారంపాటు మీ ఇంట్లోనే తిష్టవేయక మానను. కాబట్టి నువ్వు ముందు జాగ్రత్త పడడం అవసరం మారుమాట చెప్పక ఇంటికి పదు. మా ఆవిడతో నిన్ను గురించి చాలాసార్లు చెప్పాను - కథలు కూడా వెలగబెడుతున్నావుగా ఈ మధ్య. పద"

బుద్ధిమంతుడయిన కుర్రాడిలా వాడి వెంట నడిచాను.

దారిలో గడిచిన మూడు సంవత్సరాలలో, జరిగిన విషయాలు సంక్షిప్తంగా చెప్పాడు —

"నా పెళ్ళికి స్నేహితులెవర్నీ పిలవలేదు ఇష్టంలేక కాదు — టైము లేక. అంత హటాత్తుగా జరిగిపోయిందన్న మాట. ఒక్క వారం రోజుల ముందుదాకా నాకే తెలియదనుకో. మా ఆవిడ చాలా బాగుంటుంది, పాపం నాకు తగిన మనిషి కాదు. ఐ మీన్ నేనా అమ్మాయికి తగిన వాడిని కాదు మరి. నన్ను చేసుకుందుకు ఎలా ఒప్పుకుందో నాకిప్పటికీ వింతగానే ఉంటుంది చదువుకుంది ఇంటర్ దాకా హిందీలో విశారద పాసయింది ఏమయినా కానీ అదృష్టవంతుడ్ని నేను — ఆ అమ్మాయి కాదు. చూస్తావుగా! ఇంతవరకు సంతానం అనేది లేదు కాకపోతే పెళ్ళయిన కొత్తలో ఒకడు పుట్టి పోయాడు "

మాట్లాడకుండా 'ఊ' కొడుతూ వాడు చెప్పేది వింటూ నడుస్తున్నాను. అంతలోనే చలపతి మాట్లాడడం ఆపి -

"ఇదే మా ఇల్లు" అంటూ లోపలికి దారితీశాడు,

ఒక పెద్ద డాబాలో పెద్ద పోర్షను వాళ్ళది కొత్తగా కట్టిన ఇల్లు, చుట్టూ కాంపౌండు గోడ, చక్కటి వరండా- ఇల్లు చూడటానికి అందంగా ఉంది. లోపల హాల్లో ఒక చిన్న టేబుల్ వేసి చుట్టూ నాలుగు వేపుల కుర్చీలు అందంగా అమర్చబడి ఉన్నాయి — టేబుల్ మీద ఒక ఫ్లవర్ వాజు, చక్కని ఏష్‌ట్రే. తెల్లటి గోడల మీద రెండే రెండు బొమ్మలు - శివ పార్వతులవి, రాధా కృష్ణులవి ఉన్నాయి.

గోడలకి అంగుళం వెలితి లేకుండా ఫొటోలు తగిలించే ఇళ్ళను చూస్తే

నాకు కంపరం మెత్తుతుంది. వాళ్ళ సౌందర్యాలని ప్రత్యక్షంగా చూసి బాధ పడటమే కాకుండా వాళ్ళ ఇంట్లో ఉన్నంతసేపు వాళ్ళే మన కంటికి కనబడాలని కాబోలు. అలా తగిలిస్తారు - పెళ్ళినాటివి, నోములు నోచుకున్నప్పటివి వగైరా! అదీ ఒకందుకు మంచిదే - వీళ్ళ బాధ పడలేక అతిథి వెంటనే ఉడాయిస్తాడు. ఇల్లు ప్రశాంతంగా కడిగిన ముత్యంలా ఉంటే వెళ్ళమనేదాకా వెళ్ళను.

అందుకే నాకు చలపతి ఇంట్లో శాశ్వతంగా ఉండిపోదామనిపించింది. నా మనస్సుకి నచ్చేట్టు ఉంది ఇల్లు.

చలపతి ఇంట్లోంచి రావటంతో నా ఆలోచనల్లోంచి బయట పడ్డాను. వాడి వెనకనే కర్టెన్ తొలగించుకుని ఒకమ్మాయి బయటికి వచ్చింది.

"మా ఆవిడ, పేరు ఇందిర - వీడు నేను రోజూ చెబుతుంటానే - విశ్వేశ్వ రావు. కథలు గిలుకుతుంటాడు. ఒరేయ్, అన్నట్లు మా ఆవిడ నీకు పెద్ద 'ఫాను' " పెళ్ళున నవ్వాడు.

"నమస్కారమండి" అంది ఇందిర.

యాంత్రికంగా ప్రతి నమస్కారం చేశాను ఆలోచిస్తూనే. సాదా అయిన వాయిల్ చీర, దానికి సరిగా సరిపడే బ్లవుజు, చేతులకి బంగారపు గాజులు - చాలా సింపుల్ గా అందంగా ఉంది. ఇంటి అలంకరణ చూసి ఆవిడ్ని ఊహించుకుంటే ప్రత్యక్షంలో మనకి ఆశాభంగం కలగదు.

కాని నాకు అంతుపట్టని ప్రశ్న ఒకటి మొట్టుకు నన్ను వేధిస్తూనే ఉంది - ఆవి డని ఎక్కడ చూశానూ అన్నది. చూశా నన్నదిమాత్రం వాస్తవం!

ఆవిడ మాత్రం మామూలుగానే - "మీ కథలు చదువుతుంటానండి, చాలా బాగుంటాయి" అంది నవ్వుతూ.

ఎవరికయినా తన్ని గురించి ఒకరు అంటున్నప్పుడు ఏమి చేయాలన్నది పెద్ద సమస్యే - స్టేజిమీద డైలాగులు లేని నటుడిలా ఉంటుంది. "ఆఁ ఏదో లెండి, ఉబుసుపోకకి రాసేవి" అన్నాను.

"చదవటంకూడా కాలక్షేపానికే కదండీ".

ముగ్గురం నవ్వాం.

"అది సరేగాని విశ్వం, నువ్వు రాయడంలోని ఉద్దేశ్యం లోకాన్ని మరమ్మతు చేద్దామనా లేక కేవలం సరదాకా?" అడిగాడు చలపతి.

"మనం రాసినంత మాత్రాన లోక రీతి మారిపోతే ఈ పాటికి స్వర్గంలా తయారయేది-మాకూ కథా వస్తువులు దొరక్క చచ్చేవాళ్ళం" అని నవ్వి "ఒక ప్రఖ్యాత రచయిత అన్నట్టు 'పత్రికల వాళ్ళు ఇదివరకు తృణం ఇచ్చేవాళ్ళు, ఇప్పుడు పణం కూడా ఇస్తున్నారు' కాని నేను రాయడం



"చూడండి, అది ఏబండి ?"
"రైలుబండి"

అందుకోసం కాదనుకో - కేవలం మన భావాలు నలుగురితోనూ పంచుకోవాలని. అంతే" అన్నాను.

జాగ్రత్తగా వింటున్నదల్లా ఇందిర మళ్ళీ నేను తనవైపుకి చూపు తిప్పటంతో "ఒక్క అయిదు నిమిషాల్లో కాఫీ పట్టుకొస్తాను" అని లోపలికివెళ్ళిపోయింది

"ఏం భాయి, ఎలా ఉంది ఇల్లు?"

"గృహమేకదా స్వర్గసీమా అని పాడుకోవచ్చు"

"అంతమాట అనకురోయ్! అందులో హీరో మధ్యలో పెడదారిని పడ్డాడు ఇందులో నేను పెడదారినుంచి మంచి మార్గంలోపడిన వాడిని - మళ్ళీ ఝూర దలుచుకోలేదు. అన్నట్టు నీ విషయం చెప్పావు కాదు" అంటూనే పాకిట్లోకి వెళ్ళాడు

నవ్వుకున్నాను

మళ్ళీ అంతలో ఇందిర గుర్తొచ్చింది. చాలా పరిచయం లేకపోయినా మొత్తంమీద పరిచయం ఉంది నాకా అమ్మాయితో. మాట్లాడుతుంటే కూడా అలాగే అనిపిస్తోంది. కాని అయితే సమాధానం మాత్రం రావడంలేదు. కాలేజీలోనా. కాదు. పెళ్ళిచూపులలోనా ? అంత చక్కని

అమ్మాయినిచూస్తే కాదనేవాడినా?.
మరి ఎక్కడ ఏవిధంగా ?

"కాఫీ తీసుకోండి! . ఆయనేరి?"

"నీ విషయాలు చెప్పమని అడిగి వినిపించుకునే ఓపికలేక బయటికి పరుగెత్తాడు. కూర్చోండి!"

నవ్వింది ఇందిర-"ఆయన ఎప్పుడూ అంతే పరధ్యానంగా ఉంటారు. అడిగిన విషయం జ్ఞాపకం ఉంచుకోరు. చెప్పిన విషయం సరేసరి! అయినా మీకు తెలియని దేముంది - మూడేళ్ళు ఆయనతో కాపరం చేశారుగా!"

ఇద్దరం నవ్వేశాం. నా కిదే అదునని పించి -

"ఒక్క మాట అడుగుతాను. మరేమీ అనుకోరుకదా!" అన్నాను

"అడగండి"

"మనిద్దరం ఇదివర కెప్పుడయినా కలుసుకున్నామా? అహ - మీ కూ అలా అనిపిస్తోందా అని"

ఆమె కాసేపు మౌనంగా ఉండి చివరికి "లేదు" అంది

"అయితే నేనే పొరపడ్డానన్నమాట! కానీ ఎంత సరిపెట్టుకుందామన్నా మనస్సు సమాధాన పడటంలేదు మీ మాటా, నవ్వు, మీరూకూడా ఎక్కడో విన్నట్టు, చూసినట్లుగా అనిపిస్తోంది."

ఆమె తలవంచుకుని వింటోంది అంతలో హడావుడిగా చలపతి లోపలికి వస్తూ -

"ఇందిరా, మనవాడికి కాస్త కాఫీ ఇవ్వకపోయావూ? అరే, అప్పుడే తాగుతున్నాడే! మరి నాకేదీ? అహా, నాకూ తెచ్చావన్నమాట" అంటూ కాఫీకప్పు అందుకున్నాడు.

ఇందిర నావంక చూసి నవ్వింది నేనూ నవ్వేశాను

భోజనాల వేళ దాకా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము మా స్నేహితులు ఎవరెక్కడ ఏ పని చేస్తున్నదీ, విశాఖపట్టణంలోని బ్రహ్మచారి జీవితం - మొదలయిన వన్నీ నెమరువేసుకున్నాము అక్కడే ఉండిపోయి 'రీసెర్చి' చేస్తున్న వాళ్ళని తలుచుకుని ఈర్ష్య పడ్డాము ఇందిర భోజనాలకి లేవచ్చని అనడంతో నిజ జీవితంలోపడి లేచాము!

ఆ పగలంతా మామూలుగానే గడిచి పోయింది చలపతికి కూడా శలవులవటాన ఇంట్లోనే ఉండి పోయాడు. కాసేపు కారమ్సు, మరి కాసేపు నిద్రల మీదుగా సాయంత్రమయి పోయింది తరువాత సినిమా కన్నాడు చలపతి ఇందిర మొదట రానంది, కాని మా బలవంతాన రాక తప్పలేదు.

ఆమె మధ్యన కూర్చుంటే మే మిద్దరం చెరోవైపు కూర్చున్నాము.

చలపతికి వసుధః సినిమాలన్నా, నవలలన్నా పడేది కాదు అసలు

వచ్చేవాడే కాదు కాని పొరబాటున వస్తేమాత్రం ఆద్యంతం ఒక్క ముక్క విడవకుండా చూసేవాడు సమాధిలో పడిన ఋషిపుంగవుడి లాగా అందులో లీనమయిపోయి ఇచ్చిన రూపాయిన్నర గిట్టించుకుని మరీ బయటికి వచ్చేవాడు

ఇప్పటికి కూడా వాడేమీ మారలేదు

అయితే ఇందిర నా వైపుకి తిరిగి సినిమాని గురించి, కథలని గురించి నాతో మాట్లాడసాగింది ఆమెకి వాటి మీదనున్న అభిరుచికి నా కాశ్చర్యం వేసింది వీళ్ళిద్దరి మనస్తత్వాలు, అభిరుచులు ఇంత భిన్నంగా ఉండి వీళ్ళు ఒకే ఇంట్లో ఎలా గడుపుతున్నారా అనిపించింది. అంతలోనే నా కింకొక విషయం కూడా స్ఫురించింది

వాళ్ళు చేస్తున్న సంసారం కూడా ఒక నటనలాగానే చేస్తున్నారని! అంటే బయటి వాళ్ళు ఏమయినా అనుకునిపోతారన్నట్టుగా ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకుంటున్నారని! అలా ఎందుకనిపించిందో నాకే తెలియదు అసలు మామూలుగా రోజూ వీళ్ళిద్దరూ మౌనంగానే ఉంటారేమో!

"ఇప్పటికయినా మీకు నన్నెక్కడయినా చూసినట్లనిపిస్తోందా?" అనడిగాను మళ్ళీ

ఆమె నవ్వి "ఇందాకటి ప్రశ్నకి ఇందాకటి సమాధానమే! .. మీకు ఏమయినా గుర్తు కొచ్చిందా?" అనడిగింది.

ఆ అడగడంలోని ఉత్కంఠ గమనించితే ఆమెకి తెలిసికూడా దాస్తోందేమో నన్న అనుమానం కలిగింది.

"లేదుకాని వెళ్ళేలోపల కనుక్కుని మీకు చెబుతాను" అన్నాను ధీమాగా.

ఆమె సినిమా వైపుకి దృష్టి మరల్చుతూ "అయితే మీరు త్వరగా వెళ్ళిపోండి" అంది నవ్వుతూ.

ఆశ్చర్యంతో ఆమెవంక చూశాను.

పిక్చరుని తిట్టుకుంటూ ఇంటికి చేరుకున్నాము అన్నాల దగ్గర ఇద్దరూ కలిసి ఒకరిని మించి ఒకరు నన్ను బలవంతం చేసి తినిపించసాగారు. అసలు సినిమాకి వెడితే భోజనం లేకుండా పడుకోవడం నా కలవాటు. అటువంటిది వాళ్ళు విందు భోజనం లాగా తినిపించుతుంటే కడుపు నిండిపోయింది. చివరికి ఇవన్నీ చాలవన్నట్లుగా ఇందిర పెరుగు పట్టుకొచ్చి ఒడ్డించబోయింది వద్దంటే వినదని "వేస్తే పారేయడం ఖాయం – కావాలంటే వేసి చూడండి" అన్నాను

ఆడవాళ్ళ దగ్గిర ఇదే నే నుపయోగించే ఆఖరు అస్త్రం!

"తినకపోతే నా మీద ఒట్టే!" అంటూ గబుక్కున వేసేసింది.

సినిమాల్లో పోయిన మతి రావాలంటే మళ్ళీ తలమీద ఒక దెబ్బ తినిపించడమో లేక కరెంటు షాకు ఇప్పించడమో చేస్తారు. ఆ దెబ్బతో హీరో మామూలుగా తయారవుతాడు.

వచ్చినప్పటినుంచి తేలని ప్రశ్న ఇందిర అన్న ఒక్క మాటతో ఆమెని నాకు పట్టి ఇచ్చింది. ఆమెను ఎక్కడ చూసినదీ తుణ్ణంగా గుర్తుకి వచ్చేసింది. అందుకే ఆశ్చర్యం కూడా వేసింది — మరి మాధవరావు ఏమయ్యాడా అని! ఆమెవంకే చూశాను —

నా చూపులోని అర్థం గ్రహించినట్లుంది, తల వంచుకుని లోపలికి వెళ్ళిపోయింది ఇందిర.

ఇందాకటినుంచి నన్ను వేధించింది ఒక్క ప్రశ్నే అయితే ఇప్పుడు తల నిండా అనుమానాలే బయలుదేరాయి. 'ఆమె ఆ పరిస్థితిలోంచి బయటకెలా వచ్చింది? అతను ఏమయ్యాడు? చలపతికి ఈ విషయం తెలిసే చేసుకున్నాడా — ఇప్పుడు తెలిస్తే వీళ్ళ ఇంటి పరిస్థితి ఎలా ఉంటుంది?

ఆలోచనలతో సతమతమవుతున్న నా దగ్గరకు నిద్ర రానన్నది. లేచి సిగరెట్ వెలిగించుకుని వరండా దిగి బయట ఉన్న సిమెంట్ బల్లమీద కూర్చున్నాను

చంద్రుడు మబ్బుల చాటునుండి తన కాంతిని బయటకు ప్రకటించేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు అయితే మునిసిపాలిటి వారికి మాత్రం అది వెన్నెలరాత్రి కావడాన దీపాలు ఆర్పేసి రోడ్లని చీకటిలో ముంచారు

ఇంతలో ఇంట్లోంచి తలుపు తీసుకుని ఇందిర బయటికి వచ్చింది.

"హలో, మిమ్మల్ని ఎక్కడ చూసినది గుర్తుకొచ్చేసింది" అన్నాను ఆమె వంక నిశితంగా చూసేందుకు ప్రయత్నిస్తూ.

"గుర్తుకొచ్చిందని గ్రహించబట్టే ఇప్పుడు నేను బయటికొచ్చింది'' అంది మెల్లగా.

నాకు జాలేసింది!

"నో, నో మీరు నన్ను అపార్థం చేసుకోవద్దు. గుర్తుకొచ్చారన్న ఆనందమేగాని అది బెదరింపు కాదు. ఈ రహస్యం — రహస్యమే అయితే — నన్ను దాటి బయటికి పోదు.'' అని కాసేపాగి ''కూర్చోండి" అన్నాను

మాట్లాడకుండా నేల మీద కూర్చుంది. నేను కూడా బల్లదిగి ఆమెకి ఎడంగా గడ్డిమీద కూర్చున్నాను.

"ఇప్పుడు చెప్పండి అసలు కథ, మిమ్మల్ని మాధవరావుతో మద్రాసులో నేను చూడటం ఎలా సందర్భ



"అరేయ్! ఈ లేడిపిల్ల ఈ మధ్య నా వైపు చూడటమే మానుకుందే!!"
"బాగు బాగు! అయితే ఇక నా వైపు చూడటం తథ్యం!!"

పడింది ?.... స్నేహితుడుగా అడుగుతున్నాను."

ఆమె కాసేపు మౌనంగా ఉండి చివరికి "రహస్యంగా ఉంచుతానన్నారు మీరు. కాకపోయినా ఇక నేనూ దాచి ప్రయోజనం లేదు—ఎవరితోనయినా చెప్పుకునే బదులు మీకే చెబుతాను....

"మాది చాలా బీద కుటుంబం. నాన్నగారు గుమాస్తాగా సంపాదించే దాంతో మా కుటుంబం గడవటమే అస్తవ్యస్తంగా ఉండేది. దానికితోడు అమ్మ జబ్బుమనిషి. ఎప్పుడూ డాక్టర్ల అవసరంకోరే శరీరం ఆమెది. — అని చెప్పి డాక్టర్లకి చూపించే వారనడం ఆవిడకి అపచారమే చేసినట్లవుతుంది. ఉన్నదాంట్లోనే శక్తివంచన లేకుండా నాటువైద్యుల మందు నాడుతుండేవారు నాన్నగారు. నాకు తలుచుకుంటే ఇప్పటికి ఆశ్చర్యంగా ఉంటుంది — ఒక్కొక్కసారి ఇద్దరు ముగ్గురికి మాత్రమే సరిపడ అన్నం మిగిలేది. ఇంట్లో ఆనాడు పెద్దవాళ్ళ మందరం విందు భోజనాలు చేసిన వాళ్ళలాగా తేపుతూ ఆరళ్ళులేవని ఎగేసి అది కాస్తా చిన్నవాళ్ళకి - అలాగా నటించ

డంరాని వాళ్ళకి మిగిల్చేవాళ్ళం. మాలో ప్రతి ఒక్కరికి తెలుసు ఒక్కొక్కరం ఇద్దరేసి తినేది తిన గలమని.

"బీద వాళ్ళం-అంటే వసుధః బీద వాళ్ళము కాదు. కొంత ఆస్తి ఉండేది ఒకప్పుడు. కాకపోతే నాన్నగారి మితి మీరిన ఖర్చులవలన, కొద్దిగా చీట్లాట వలన, కోర్టు దావాలవలన అదికాస్తా హారించిపోయింది." ఇది నేను బుద్ధి తెలిశాకే జరిగింది. కాబట్టి నాకు ఏదో విధాన కొద్దిరోజులపాటు రుచిచూసిన ఆజీవితం మళ్ళీవస్తే బాగుండునని కలలు కంటుండేదాన్ని !

"అది ఆయన దురదృష్టమో, మా గ్రహబలమో తెలియదుగాని ఆయనకి మొదట కలిగిన ఇద్దరం ఆడపిల్లలమే. నాన్నగారికి చేతిలో ఆస్తి ఉన్నప్పుడే అక్కయ్య పెళ్ళిడుకి వచ్చింది కాబట్టి దాని అదృష్టం బావుండి బాగా కల వారింటి కోడలయింది. బావ బాగా ధనవంతుడు. అయితే అతని గుణాలు మాత్రం మంచివి కావని వచ్చినప్పుడల్లా అక్కయ్య చెప్పుకుని ఏడిచేది. అందు వలన నాకు మొదటినుంచి బావఅంటే సదభిప్రాయం లేకపోగా చాలా అస హ్యంగా ఉండేది. ఆయనకి లేని అల వాట్లు లేవుట ! కాకపోతే ఆయనలోని ఒక్క సుగుణం ఏమిటంటే మా అక్కయ్య మా కుటుంబానికి సాయం చేస్తుంటే అడ్డుచెప్పేవాడుకాదు. అదే పెద్ద వరంగా భావించేవాళ్ళు మా వాళ్ళు."

"నా తరువాత ముగ్గురు తమ్ముళ్ళు న్నారు. అందులో పెద్దవాడికి నాకు అయిదేళ్ళు తేడా! ఇంతకీ నేను చెప్ప వచ్చేది - మా కుటుంబానికి త్వరగా అంది వచ్చేందుకు మగపిల్లలు లేకపోగా వయస్సు మీదికొస్తున్న నేను మాత్రం మావాళ్ళకిబరువుగా తయారయాను."

"నేను చిన్నతనంనుంచి స్కాలర్ షిప్‌తో చదువుకుంటూ ఇంటర్‌లోకి వచ్చాను."

"అప్పట్లో మాధవరావు-అదే" మీ మిత్రుడు - మా ఇంటికి ఎదురుగాఉన్న గదిలో అద్దెకుంటుండేవాడు. బాగా ఉన్నవాడు, పైగా వాళ్ళకుటుంబంలో ఒక్కగానొక్క మగపిల్లాడుట ! అందు కని అతని దర్జాకి లోటుండేది కాదు. ఎప్పుడూ మడత నలగని డ్రస్సులో ట్రిమ్‌గా తయారయేవాడు. ఎడాపెడా స్నేహితులతో తిరుగుతుండేవాడు రోడ్లమ్మట" అని కాసేపాగి చిన్నగా నవ్వి "మీరు ఏదో అడుగుతే మా కుటుంబ చరిత్రంతా ఏకరువు పెడు తున్నాను. విసుగ్గా లేదుకదా?" అంది.

''అబ్బే, అటువంటిదేమీ లేదు లెండి. బాక్‌గ్రౌండు తెలియందే మీరు ఏ పరిస్థితుల్లో ." అని మాట పూర్తి చేయకుండానే ఆపేశాను.

మళ్ళీ వె[illegible]ట్టింది ఇందిర —

"నేను [illegible]కిదివరకే చెప్పాను — సుఖం అన్నది కొద్దిరోజులపాటే అనుభవించాను కాబట్టి నాకు ఏవిధంగా నయినా తిరిగి దాన్ని పొందాలని, జీవితంలో 'లేమి' అన్నది లేకుండా బ్రతకాలని కోరికగా ఉండేది! కోరికే కాదు — అదెలాగయినా సాధించా లన్న పట్టుదల కూడా ఉండేది!

"నన్ను మా కాలేజీలో అందరూ 'మిస్ కాలేజి' అని పిలిచేవారు నా వెంటపడే మగపిల్లల్ని చూసీ, నన్ను చూసీ ఈర్ష్యపడే నా సహాధ్యాయినులని తలుచుకునీ నాకు ఒక గట్టి నమ్మకం ఏర్పడిపోయింది. — అది నాలో అందరినీ ఆకర్షించే అందం ఉందనీ, అదేనాకు భగవంతుడు పెట్టిన సొమ్మనీ! దాన్నే నా భవిష్యత్తుని బాగుపరుచుకు నేందుకు ముడిసరుకుగా వాడదల్చుకున్నాను. అందం ఉంది, ఇంటర్ చదువుతున్నాను — ఏమిటి నాకు తక్కువ అని గర్వపడేదాన్ని! అది కేవలం మా ఇంటి వాతావరణం మర్చిపోయేందు కనుకునే మాట!

"మాధవరావు సాధ్య మయినప్పుడల్లా నావంక చూసేవాడు కాని వెకిలి వేషాలు మాత్రం వేసేవాడు కాదు రోడ్డుమీద కొంచెం అసభ్యంగానే ప్రవర్తిస్తాడని మా ఫ్రెండ్సు అనేవాళ్ళు కాని నాపట్ల మాత్రం అతను చాలా. గౌరవంగా ఉన్నట్టు నడిచేవాడు

"అతను చూపుల్తోనే నన్ను ఆరాధిస్తున్నాడని గ్రహించేందుకు నాకు ఆట్టే కాలం పట్టలేదు అది నాకు చాలా ఆనందాన్ని కలుగచేసింది కూడా మా మధ్య పరిచయం కలిగితే దాన్ని వృద్ధిచేసేందుకే నిశ్చయించుకున్నాను

"రోగి పథ్యమే అడిగాడు, వైద్యుడు పథ్యమే పెట్టమన్నాడు అన్నట్లుగా నేను ఇంటరు సెకండియర్ లో ఉండగా అతను కాలేజీకి ప్రెసిడెంటు అయ్యాడు ఆ హోదాలో అప్పుడప్పుడు మీటింగ్స్ అవీ ఏర్పాటు చేసేందుకు మా గరల్స్ వెయిటింగ్ రూంకి వచ్చేవాడు. అది కేవలం నాతో మాట్లాడేందుకేనని నాకు తెలుసు ఎందుకంటే మా సెక్రెటరీ ఒక మ్మాయి వేరే ఉన్నప్పటికీ నన్ను మాత్రమే ఉద్దేశించి మాట్లాడేవాడు. నేనూ చనువుగా మాట్లాడేసేదాన్ని

"ఈ విధంగా ప్రారంభమయిన మా పరిచయం ఇంటికి వెళ్ళే దారిలో అతను నన్ను కలుసుకోవడం, మేమిద్దరం కలిసి నడవడం, ఇంటి దగ్గర కూడా తన రూంలో ఉన్న మాగజైన్సు అతను నా కివ్వడం వగైరాలు జరుగుతుండేవి

'మీరు' లోంచి 'నువ్వు'లోకి దిగింది సంబోధన!

సరిగ్గా ఈ సమయంలో మా కుటుంబానికి పెద్ద దెబ్బ తగిలింది పురుడొచ్చి మా అక్కయ్య పసికందుతో సహా కన్నుమూసింది!

అక్కయ్య నాతో చాలా చనువుగా ఉండేది అందువల్ల దాని మరణం నా మీద బాగా ప్రభావం చూపించింది లోకం అంతా అంధకారంగా కనిపించింది

అప్పుడు మాధవరావు తనకి తెలిసిన వేదాంతం ఏదో చెప్పి నన్ను ఓదార్చ ప్రయత్నించేవాడు దాంతో నాకింకా సన్నిహితుడయాడతను

మా ఇంట్లో మాత్రం అక్కయ్య పోయిన విచారం ఒక పక్క ఉన్నా మా కుటుంబానికి అది చేసే సహాయం ఆగిపోవడం మరీ బాధించింది మా వాళ్ళని బావని ఏ ముఖం పెట్టుకు అడగ్గలరు?—అది లేకపోతే సంసారం గడిచేదెలా?

అక్కయ్య పోయిన నెలకి మా అమ్మకి బ్రహ్మాండమయిన ఆలోచన వచ్చింది అది బావని ఇతరత్రా పోనీయకుండా వాళ్ళకి "రొమ్ముల మీద కుంపటిలా ఎదిగి కూర్చున్న" నన్ను ఆయనకిచ్చి పెళ్ళిచేయడం! ఈ ఆలోచన కలిగించిన ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయి నాన్న గారు బావని పిలిపించి అడిగారు ఆయన వెంటనే ఎగిరి గంతేసి ఒప్పుకున్నాడు ఒక అందమయిన అమ్మాయి వెతుక్కుంటూ వెతికి దొరుకుతుంటే కాదనేటంత తెలివి తక్కువవాడు కాదాయన

నేను బ్రతిమాలాను నాకు ఏకోశానా ఆయనంటే గౌరవం లేదు-పైగా ఆయన వయస్సు నాకు రెట్టింపు పైన ఉంటుంది 'నా జీవితం నాశనం చేయకండి' అని ఏడిచాను

"మరి సంసారం గడిచేదెలా?" అన్నది వాళ్ళ ప్రశ్న

"నాకు ఇంటరు అయిపోయింది. కాబట్టి పాసయాక ఉద్యోగంలో చేరతాను" అన్నాను

"పెళ్ళీ, పెటాకులూ లేకుండా ఎన్నాళ్ళుంటావు? అది మాకు అవమానం కాదూ?" అన్నారు

వాళ్ళు పరువుకోసం, వాళ్ళ సంరక్షణకోసం నన్ను బలిచేసేందుకు సిద్ధంగా ఉన్నారు వాళ్ళు పరాయివాళ్ళయితే ఎదిరించేదాన్ని. కాని స్వంత తల్లితండ్రులు! ఇక ఎవరితో చెప్పుకోను?

— అంతా విని "నన్ను చేసుకుందుకు నీ కిష్టమేనా" అన్నాడు మాధవరావు నాకు మాత్రం అంత కన్నా కావలసిందేముంది? నా కలలు ఫలించే రోజు వచ్చిందనుకున్నాను



"అమ్మాయ్! రాత్రి ఆయనగారు నాకు 'సిగ్గు' అంటూ లేదన్నారే. కాస్త నీ దగ్గరుంటే యిద్దూ!"

"అవాళే మద్రాసు బయల్దేరి వెళ్ళిపోయాం. అక్కడ రిజిష్టర్ మారేజి చేసుకుని తరువాత వాళ్ళ వాళ్ళకి తెలియజేస్తానన్నాడు. వాళ్ళు తన మాట కాదంటే ఇంటికి వచ్చేది లేదని రాసేస్తానని — దాంతో హడలిపోయి దారికి వస్తారని అన్నాడు.

"ఒక నెలరోజులపాటు జీవితంలో డబ్బు అందించే సుఖాలన్నీ రుచి చూచాను. పెద్ద హోటల్లో మకాం— అప్పట్లోనే మీరు వచ్చింది కూడా!" ఆపింది ఇందిర — ఆలోచనలకి నాకు టైము ఇస్తూ.

అవును, మాధవరావు నాకు చిన్నప్పుడు స్నేహితుడు. మద్రాసులో ఏదో పనుండి వెడితే హటాత్తుగా కలిశాడు. వస్తేగాని, వీల్లేదని ఆహోటల్లోని గదికి లాక్కెళ్ళాడు. అక్కడే నేను ఇందిరని చూశాను.

"నా కాబోయే అర్ధాంగి — ఎలా ఉంది?" అని "కథంతా తర్వాత చెబుతాలే" అన్నాడు నవ్వుతూ.

నాకు మాత్రం నమ్మకం కలగ లేదు. ఎక్కడో కొట్టుకొచ్చాడు. ఈ అమాయకురాలిని ఏ గంగలోనో కలిపి పరారవుతాడని అనిపించింది.

అలా ఎందుకనిపించిందో, నేనైతే చెప్పలేను బహుశా ఏమీలేని ఆ అమ్మాయిని చేసుకునేంత త్యాగం అతనిలో లేదని తెలిసి కాబోలు నా వెధవ ఆలోచనలకి నాకే అసహ్యం వేసింది వాళ్ళను దంపతులుగా చూసేందుకు ప్రయత్నించాను ఉన్న కాసేపూ

అప్పుడే కారియర్ తెప్పించి ఇందిరే నాకు స్వయంగా వడ్డించింది కొసరి కొసరి వేసి పారేస్తానంటే తన మీద ఒట్టేసుకుని తినిపించింది!

ప్రపంచంలోని ఆనందమంతా మూటకట్టుకుని దగ్గర పెట్టుకున్నట్లుంది ఆవాళ నేను చూసినప్పుడు అప్రయత్నంగా ఎదురుగా నున్న ఇందిరని చూశాను - చాలా భేదం కనిపించింది జీవితాన్ని శాసించే ధైర్యం కోల్పోయి అది నడిపినట్లల్లా నడుద్దామన్న నిర్లిప్తత ద్యోతక మవుతోంది

"తరువాత ఏమయింది?" అనడిగాను సిగరెట్టు ముట్టించుకుంటూ

"ఏముంది, మామూలుగా ఇలా తొందరపడేవాళ్ళకి జరిగేకథే ఇంటి దగ్గర ఇతని విషయం తెలిసి వాళ్ళ మావయ్య వచ్చాడు ఇద్దరూ కలిసి ఏమేమో మాట్లాడుకునే వాళ్ళు చివరికి ఒక రోజు సినిమాకి వెడతామని వెళ్ళిన వాళ్ళు మళ్ళీ రాలేదు అతని ఖాళీ పెట్టెలో మాత్రం ఒక వెయ్యి రూపాయలు, తన్ని క్షమించమన్న వేడుకోలు - తిరిగి ఇంటికి వెళ్ళిపొమ్మని సలహా ఉన్నాయి

కాసేపు ఆ వెయ్యిరూపాయలు చించి అవతల పారేద్దా మనిపించింది కాని అంతలోనే నాలోని యుక్తాయుక్త విచక్షణా జ్ఞానం మేలుకుంది భద్రంగా అది పుచ్చుకుని ఇంటికి బయల్దేరాను మనస్సు బండబారిపోయింది ఎవరేమంటారోనన్న భయంపోయింది

ఇంటి దగ్గర తిట్లతో స్వాగతం పలికారు కాని నా దగ్గర ఉన్న వెయ్యి రూపాయలు వాళ్ళ కోపాన్ని అణగ ద్రొక్కేశాయి బీదరికం మనుష్యుల్ని అంతగా దిగజార్చేస్తుంది

అసలే బీదవాళ్ళం, అందులో స్వంత తెలివితేటలవలన ఒక మాయని మచ్చ తెచ్చుకున్నాను చివరికి మా బావకికూడా నేను తగని దాన్నయ్యాను నా కింక జీవితంలో పెళ్ళవుతుందన్న ఆశ పోయింది ఉద్యోగం కోసం ప్రయత్నించ సాగాను

కాని కోరని వరంలా వీరి సంబంధం వచ్చింది మా బాబాయి ఒకాయన ద్వారా నాగతం కప్పిపుచ్చారు వాళ్లూ పాపం అమాయకులు కాబోలు, నన్ను గురించి విచారించనేలేదు ఏమాత్రం ఎవరినడిగినా నా చరిత్ర చెప్పేవారు కాని అటువంటిదేమీ జరగలేదు కట్నం అక్కరలేదన్నారు

తిరుపతిలో పెళ్ళి జరగాలన్నారు- అది మా వాళ్లకి బాగా నేఉంది-ఊళ్లో జరుగుతే నోళ్ళు మూయడం కష్టమయేది.

అటునుంచి నేరుగా ఈవూరొచ్చి కాపరం పెట్టాము కొత్తలో ఆయన మన్నుతిన్న పాములా నిర్లిప్తంగా ఉండేవారు ఏమడిగినా ఊకొట్టేవారు కాని ఇప్పుడు కొంచెం నయం - ఎవరయినా వచ్చినప్పుడయినా ఎంతో అన్యోన్యంగా ఉన్నట్టు మాట్లాడటం నేర్చుకున్నారు చివరికి పెళ్ళయిన ఎనిమిది నెలలకే నాకు మగపిల్లాడు పుట్టిపోయాడు అయినా ఆయనకి అనుమానం రాలేదు ఆ పాపం అక్కడితో ప్రక్షాళిత మయి పోయింది

'అయినా ఎన్నాళ్ళీ అగ్ని పర్వతం పేలకుండా ఉంటుంది' అనిపిస్తుంది అప్పుడప్పుడు నిజం ఏనాటికయినా బయట పడక మానదు నేను ఇప్పుడు గడుపుతున్న జీవితం, ఈ డబ్బులంతా నీటి బుడగలాంటిదని నాకు తెలుసు అది ఏ నాడు పేలిపోతుందోనని అనుక్షణం ఆ భీతితోనే బ్రతుకుతున్నాను ఒక్కొక్కప్పుడనిపిస్తుంది - అంతా ఆయనకి చెప్పేసి ఆ రాబోయే ఫలితానికి తలఒగ్గుదామని కాని అంతలోనే పిరికితనం ఆవరించుకుంటుంది నా గతం తెలిసిననాడు ఆయన నన్ను క్షమిస్తారా అని" ముగించి నిట్టూర్చింది ఇందిర

నేను ఏమీ మాట్లాడలేదు ఆమె అన్న చివరిమాటలు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి ఏ మగవాడయినా అటువంటి సన్నివేశాన్ని ఎదుర్కొన్నప్పుడు ఏం చేస్తాడు? నా మట్టుకు నేను ఏం చేస్తాను?

"ఇక లేవండి - ఇప్పటికే చాలా ఆలస్యమయిపోయింది పాపం మీ నిద్ర పాడు చేసుకున్నారు" అంటూనే తను లేచి మెల్లిగా ఇంట్లోకి వెళ్ళిపోయింది

నేనూ ఆమెని అనుసరించాను

మర్నాడల్లా నా స్వంత పనులమీద ఊరుని ఉద్ధరించడం సరిపోయింది సాయంత్రం ఇంటికి వచ్చేసరికి చలపతి చెప్పాడు - మర్నాడు వాడి పినతల్లి కొడుకు ఒకతను వస్తున్నాడని

నాకు కొంచెం కష్టమేసింది అది ఆయన వస్తున్నాడని కాదు - నేను అనవసరంగా ఇక్కడ దిగానని బస్తీల్లో ఒక అతిథి వస్తేనే అంతంత మాత్రంగా ఉంటుంది దాని మీద మరొకరుకూ వస్తే ఇక చెప్పవలసిన పనిలేదు అయినా నే వచ్చిన పని ఆ మర్నాటితో అయిపోతుందికదా అని సమాధాన పడ్డాను

ఉదయం మెయిలుకి స్టేషనుకి వెళ్ళి వెంటపెట్టుకుని వచ్చాడు చలపతి అతన్ని వచ్చిన మనిషిని చూసి తెల్ల పోయాను -

దేముడు కూడా తన సృష్టితో



"బాబ్బాబు! ఈ ఖాతా పుస్తకాలుకూడా తీసుకుపోండి!

ఆడుకుంటాడు కాబోలు విచిత్ర సన్ని వేశాల్లో మానవులని ఇరికించి చోద్యం చూస్తాడు

వచ్చాడు మాధవరావు!

వస్తూనే నన్ను చూసి "నువ్విక్కడున్నా వేమిటోయ్" అన్నాడు ఆశ్చర్యంగా

నవ్వి ఊరుకున్నాను. అతని రాక నాకేమీ నచ్చలేదు. కాని అందుకు అతన్ననవలసిన పని లేదు.

"నువ్వు వీడిని ఎరుగున్నా వేమిటిరా మాధవా - వీడు నాకు బెస్టు ఫ్రెండు మొన్న రోడ్డుమీద దొరుకుతే కొట్టుకొచ్చాను." అని నా వైపుకి తిరిగి "మా మాధవుడ్ని చూసి అప్పుడే నాలుగేళ్ళయిందిరా విశ్వం! వాడి లీలలు ఆ నోటా ఆ నోటా వినటమేకాని మనిషిని చూసే భాగ్యం లేకపోయింది. ఇన్నిరోజుల తరువాత ఇవ్వాళే!" అన్నాడు చలపతి.

ఇద్దరూ నవ్వారు.

నాకు మాత్రం నవ్వురాలేదు. ఎదుర్కోబోయే సన్ని వేశాల్ని గురించి ఆలోచించుతున్నాను. ఇప్పుడు ఇందిరని పిలుస్తాడు పరిచయం చేసేందుకు!



అనామత్తుగా నేను చాలా డబ్బు వాడేశాను "

చలపతి గబగబ లోపలికివెళ్ళి మళ్ళీ వచ్చి "కాఫీ తెస్తోంది" అన్నాడు

ఈ పరిస్థితిలో ఇందిరకి నా సహాయం కొంతయినా అవసరం అని గ్రహించి గబుక్కున లేచి పనున్న వాడిలాగా లోపలికి పోబోయాను అంతలోనే ఆమె ట్రే నిండా కాఫీ కప్పులను పెట్టుకుని ఎదురయింది

"ఇదుగో ఇందిరా, నే చెప్పలే వస్తాడని వాడే ఈ శాస్త్రి, మాధవ రావు ఆవిడే నా మిసెస్" అంటూ పరిచయాలు చేశాడు చలపతి ఒకరి నొకరు చూసుకున్నారు రెండు అగ్ని పర్వతాలు పగలబోయాయి

ఇందిర చేతిలోంచి ట్రే జారి పడ బోతుందని గ్రహించి గబుక్కున పట్టుకున్నాను

"పాత అతిథిగారు అప్పుడే ఫామిలీ మెంబరయి కొత్తవారికి ఆతిధ్యం ఇస్తున్నారన్న మాట - వెరీగుడ్" అంటూ టేబుల్ని ఖాళీ చేస్తున్నాడు చలపతి

"మీరు లోపలికి వెళ్ళి పంచదార తీసుకురండి" అన్నాను మెల్లిగా ఇందిరతో

టేబుల్ మీద. ట్రే పెట్టి కాఫీ కప్పులు అందించాను

"ఇందిరేదీ ?" అడిగాడు చలపతి

"పంచదార తెమ్మన్నాను"

"సరిపోయిందే !"

"నా క్కావాలి !"

మాధవరావు యాంత్రికంగా కాఫీ తాగుతున్నాడు వాతావరణం చాలా స్తబ్దంగా ఉంది అందుకని నేనే కల్పించుకుని -

"ఏం మాధవరావు, ఇప్పుడేం చేస్తున్నావు ?" అనడిగాను

"ఆఁ" అన్నాడు తెప్పరిల్లి

మళ్ళీ అదే ప్రశ్న అడిగాను

"నేనా విజయనగరం దగ్గర మాంగనీస్ గనులు తవ్విస్తున్నాము నేనూ మా మావగారూ కలిసి ఇప్పుడక్కడికే వెడుతున్నాను"

"అయితే పెళ్ళి అయిందన్న మాట !" అన్నాను ఆశ్చర్యంగా

తలెత్తి నా... చూసి తల వంచేసుకున్నాడు.

"అరే మాధవా-అన్నట్టు ఆ మధ్య ఏవో కొన్ని లీలలు జరిపావని విన్నాను ?" అడిగాడు చలపతి

"ఏమిటి ?" అన్నాడు మాధవరావు పరధ్యానంగానే

"పంచదార టేబుల్ మీద పెట్టండి" అన్నాను ఇందిరతో

"అదే, నువ్వు ఎవరో అమ్మాయితో మద్రాసులో ఒక నెల్లాళ్ళు వెలగబెట్టావని మావయ్యా చెప్పాడులే ఆ విషయం"

పగిలి పోబోతున్న పంచదార సీసాని అమాంతంగా రక్షించాను !

ఇందిర గబగబ లోపలికి వెళ్ళి పోయింది

"ఇందిరకి ఇవ్వాళ ఒంట్లో బాగా లేదా ?" అన్నాడు నా వంక చూస్తూ చలపతి

నాకు నవ్వొచ్చింది

"'తలనెప్పిగా ఉందన్నయ్యగారూ' అంది పొద్దున్న" అన్నాను

కాఫీలమధ్య ఏవేవో అడుగుతున్నాడు చలపతి అతని ప్రశ్నలు గాని వాటికి మాధవరావు జవాబులు గాని ఏవీ వినిపించడంలేదు నాకు ఈ పరిస్థితిని చక్కబరచడ మెలాగా అని ఆలోచిస్తున్నాను

కాఫీ లయాక "అలా పోయొద్దాం వస్తావా విశ్వం" అన్నాడు మాధవరావు

అతనుకూడా తెలివికలవాడే నని పించింది నా కా క్షణంలో "విత్ ప్లెజర్ — నీలాంటి లక్షాధికారికి కంపెనీగా ఉండటంకన్న ఆనంద మేముందోయ్ ?" అన్నాను నవ్వుతూ

"నేనూ వస్తున్నా ఆగండిరా" అంటూ లేవబోయాడు చలపతి

"పడిశావుగాని కూర్చో — కాఫీలు

తాగేవేళ భార్యాభర్తల మధ్య మే మెందుకని బయటికి పోతుంటే తనూ వస్తాట్ట! పదవోయ్ మాధవరావు" అని బయటికి నడిచాను.

హోటలుకి చేరుకుని ఒక మూల కూర్చునేదాకా ఇద్దరం మాట్లాడలేదు. అప్పుడు —

"నువ్వంత అసహ్యంగా ప్రవర్తించ గలవని అనుకోలేదోయ్" అన్నాను.

"ఇందిర చెప్పిందా?"

"అవును — మొదట నన్నెరగ నట్టుగా ప్రవర్తించింది. పాపం మగ జాతి అంటేనే జడిసిపోయినట్టుంది. నేను తన రహస్యం రచ్చకీడుస్తానని భయపడింది."

" ...."

"అవునూ అలా ఆమెను వదిలి వెళ్ళేప్పుడు ఆమె భవిష్యత్తు ఏమవుతుంది అన్న భయం అయినా కలగ లేదూ నీకు?"

" ...."

"సభ్య కుటుంబంలో పుట్టిన ఆడ పిల్ల, అందునా బీద ఇంటి పిల్ల — నువ్వు తెచ్చిన మచ్చ భరించలేక ఆత్మ హత్య చేసుకుంటే ఆ పాపం ఆ జన్మాంతం వెన్నాడేది తెలుసా?"

" ...."

అతని మౌనం నన్ను మరీ రెచ్చ గొట్టింది "నీలాంటివాళ్ళు ఉండబట్టే మగవాళ్ళకి తుమ్మెదలు అన్న పేరు సామూహికంగా సంప్రాప్తమయింది. నువ్వు వదిలిపోయేప్పుడు ఆ అమ్మాయి వట్టిమనిషి కూడా కాదుట తెలుసా?"

ఆశ్చర్యంగా నావంక చూశాడు.

"అవునులే, నెల్లాళ్ళ అనుభవంకి ప్రతిఫలంగా వెయ్యిరూపాయలిచ్చావుగా - నీ మనస్సుకి డెబిట్, క్రెడిట్ సరిపోయుంటాయి. అప్పటినుంచి మళ్ళీ ఇవ్వాళే నీకు ఇందిర గుర్తుకొచ్చి ఉంటుంది"

చేతుల్లో ముఖం దాచేసుకున్నాడు మాధవరావు!

తెల్లబోయాను.

"నాటకంలో ఇదీ ఒక భాగమా?"

చేతులు తీసేసి తలెత్తి నా వంక చూశాడు. అతని కళ్ళలో నీళ్ళు నన్ను కరిగించేశాయి.

"నేను అప్పట్లో ఆ విషయం అంత సీరియస్‌గా తీసుకోలేదు విశ్వం. ఏదో తన పరిస్థితిని చక్కబరుచుకునేందుకు నన్ను వాడుకుంటోందనుకున్నాను. అందుకే మామయ్యొచ్చి డబ్బిచ్చి వదిలించుకోమంటే ఆట్టే ఆలోచించ కుండానే 'సరే' అనేశాను. అవతల లక్షరూపాయల కట్నంతో పిల్ల నీకోసం సిద్ధంగా ఉందంటే ఆనందపడ్డాను. కాబోయే మామగారికి ఇద్దరే కూతుళ్లు. ఏనాటికయినా ఆ మాంగనీసు గనులు ఆస్తిలో సగం భాగం నీదేనంటే నా అంత అదృష్టవంతుడు లేడనుకున్నాను.

"కాని ఇందిరని వదిలి వెళ్ళిపోయిన మరుక్షణం గ్రహించాను - ఆమె నా జీవితంలో ఎంతటిస్థానాన్ని ఆక్రమించుకుందీ, ఎంతటి అమూల్యమయిన దాన్ని నేను పోగొట్టుకున్నదీను. దానికి తోడు నేను చేసుకున్న అమ్మాయికూడా నా పశ్చాత్తాపాన్ని వృద్ధిపరిచేందుకు సర్వవిధాలాతోడుపడుతోంది.డబ్బున్న దాన్నని అహంకారం. నన్ను లక్ష్య పెట్టదు. నాతో సరిగా మాట్లాడదు. తన్ని, తన ఆస్తినిచూసి చేసుకున్నవాడు ఎవడికోసం పడుండదన్నట్టుగా ఉంటుంది.

"నా కాపరంలో అనుక్షణం నాకు ఇందిర గుర్తుకొస్తుంది. ఆ నెలరోజులు దాంపత్యానికి నిర్వచనం లాంటివి. ఇప్పుడు మా ఇంట్లో జరుగుతున్న ప్రతి దానికి ఆ రోజులతో పోల్చి చూసుకుంటాను. ఎంతో తేలివి కనబడుతుంది.

"నేనెప్పుడూ గతంలోనే బ్రతుకుతుంటాను. ఆ నెలా నా జీవితంలో మరుపురాని కాలం"

నేను మాట్లాడకుండా వింటున్నాను.

"ఇందిర ఆత్మహత్య చేసుకుంటుందేమోనన్న భయం మాత్రం నాకు ఆట్టే కలగలేదు. ఎందుకంటే ఇందిర చాలా నిబ్బరమయిన మనిషి. ఎన్ని కష్టాలనయినా గుండె దిటవుతో ఎదుర్కో గలదు. దీనికితోడు ఆమె తిరిగి ఇంటికి వెళ్ళిపోయిందని, సలక్షణంగా పెళ్ళికూడా అయిందని విన్నాను. కాని ఆ పెళ్ళి జరగటం మా చలపతితోనేనని నేను కలలో కూడా అనుకోలేదు. తెలిస్తే ఇక్కడికి వచ్చేవాడినే కాను.

"ఇప్పుడు ఇందిర అనుకుంటూ ఉంటుంది తన జీవితం సర్వనాశనం చేసేందుకుమళ్ళీ నేను దాపురించానని" అని కాసేపాగి "నన్నిప్పుడేం చేయమంటావు ? మళ్ళీ చలపతి ఇంటికి వెళ్ళబుద్ధి కావడంలేదు." అన్నాడు.

నేనూ కాసేపు ఆలోచించాను.

"అదే తప్పు. అతనికి లేని అనుమానాన్ని నువ్విప్పుడు అర్ధంతరంగా అంతర్ధానం అయి తే కలిగించినవాడవవుతావు. కాబట్టి మనం మామూలుగానే ప్రవర్తించాలి. ఇంటికి పోదాం పద."

మాధవరావుకి మాత్రం ఆ పని ఇష్టంలేదు లాగుంది "నే నిప్పుడప్పుడే రాను. కొంచెం ఊళ్ళో తిరిగి మధ్యాహ్నంగా వస్తాను. చలపతి అడిగితే చెప్పు — స్వంత పనిమీద ఎవడో ఝుంఝుంవాలాని కలుసుకునేందుకు పోయాడని. వాడీ వూళ్ళో పెద్ద వ్యాపారస్తుడులే. మా మాంగనీస్ ఓర్ ఎగుమతికి కంట్రాక్టరు"

ఇద్దరం విడిపోయాం.

నేను మాత్రం నేరుగా ఇంటికి చేరుకున్నాను. వరండా మెట్లెక్కుతున్న

"ఏమయ్యా అంత డబ్బు తీసుకున్నావ్ 'ఇంటికి రెండుసార్లు వెల్లవేస్తా'నని."
"రెండోసారి వెయ్యాల్సిన వెల్లనికూడ ఇందులోనే కలిపేసి ఒకసారే వేశేశానండి."

వాడినల్లా లోపలనుంచి మాటలు వినబడి గబుక్కున ఆగిపోయి పక్కగా నిలబడ్డాను.

కాని వినబడుతున్న ఆడగొంతు ఇందిరది కాదు. చలపతి ఎవరితోనో మాట్లాడుతున్నాడు. చాలా మెల్లిగా బాధతో కూడినట్లుంది అతని కంఠ స్వరం. అప్రయత్నంగానే వాళ్ళ మాటలు వినసాగాను –

"ఎలా ఉంది కళ్యాణీ జీవితం ?"

ఆమె నవ్వింది పేలవంగా.

"చూస్తున్నారుగా! కొన్నాళ్ళు ఇంట్లో ఖాళీగా కూర్చోవడంతో ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయింది. జీవితం నిస్సారంగా కనబడింది. కనీసం ఏదయినా యాంత్రికంగా చేసుకుపోయే పనయినా దొరికితే బాగుండు ననిపించింది. దానికితోడు మా వాళ్ళు నేను ఏదయినా అఘాయిత్యం తలపెడతానేమోనని అనుక్షణం నా కదలికల్ని కనిపెడుతుండేవారు. చివరికి మార్పులేని ఆ జీవితంతో విసిగిపోయాను. అదృష్టవశాత్తు ఈ ఉద్యోగం గురించి తెలిసింది. వెంటనే

అప్లైచేశాను. ఇది మూడు నెలలపాటు ఉంటుంది. ఇంటింటికి వెళ్ళి మా కంపెనీ వస్తువుల ప్రత్యేకత గురించి చెప్పడం, వాటికి నిదర్శనాలుగా వాటిని వాడి చూపించడం-ఇదీ కార్యక్రమం. జీతం మాత్రం బాగానే ముడుతుంది."

చలపతి నిట్టూర్చి "తరువాత ఏం చేద్దామని" అన్నాడు.

"ఇంకా ఆలోచించుకోలేదు. బహుశా ట్రైనింగుకి వెడతాను."

చలపతి ఆశ్చర్యపోయినట్టు కనిపించాడు. "అయితే ఇప్పట్లో.... పెళ్ళి చేసుకోవా ?"

"ఈ జీవితానికి అదొక్కటే తక్కువ. కాని ఎల్లకాలం ఇలాగే ఉంటానని మాత్రం అనను లెండి. మళ్ళీ ఉద్యోగం మొహమ్మొత్తితే అప్పుడు"

కాసేపు ఎవరూ మాట్లాడలేదు. ఎవరి ఆలోచనలతో వాళ్ళు సతమతమవుతున్నట్టున్నారు. చివరికి చలపతే అన్నాడు "నీకు అన్యాయం చేశాను కళ్యాణీ – నీ జీవితం పాడుచేశాను" అని.

"మీరు చేసింది అంటూ ఏమయినా ఉంటే అంతకన్న ఎక్కువ నేనూ చేశాను. కాబట్టి నన్నూ నిందించండి ....విధి మనమీద కత్తికట్టింది–దాన్ని ఎదిరించే ధైర్యం ఇద్దరికీ లేకపోయింది. కాని ఒక్కటి మాత్రం నిజం. నేను ఏమాత్రం చేయూత నిచ్చినా మీరు నిలబడేవారు.... కాని ఇలా జరగడమే బావుంది లెండి. విలువలు మనకా వస్తువులు దూరమయినప్పుడే తెలుస్తాయి. మిమ్మల్ని జీవితంలో మరిచిపోలేను.... వెళ్ళిరానా మరి !"

"అప్పుడే....అవునులే వెళ్ళటమే మంచిది. పద" అంటూ లేచి ఆమెని అనుసరించాడు.

గేటుదాకా ఆమెని సాగనంపి ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయాడు గేటు కానుకుని. చేతిలోని రెక్జిన్ బాక్స్‌తో ఆమె మెల్లగా నడిచి వెళ్ళిపోతోంది.

మెల్లిగా వెళ్ళి వాడి పక్కనే నిలబడి బుజంమీద చేయి వేశాను.

ఉలిక్కిపడి నావంక చూశాడు.

కళ్ళు నిండిన నీరు పొంగి కిందికి రాలింది !

"ఛ,ఛ, పిచ్చివాడిలా అదేమిటిరా! ఇంత మాత్రానికే బెంబేలు పడిపోతే ఎలారా – ఆ అమ్మాయి చూడు, ఆడపిల్లయినా అంతా హాలాహలంలా మింగి కర్తవ్య పాలనకోసం ఎలా వెడుతోందో ! పద లోపలికి" అంటూ వాడిని ఇంట్లోకి తీసుకెళ్ళాను.

కూర్చున్నాక నా సిగరెట్టు వెలిగించుకొని వాడిదీ, ముట్టించుతూ – "ఇందిర ఇంట్లో లేదా ?" అన్నాను.

"లేదు, తలనెప్పిగా ఉందంటే

బలవంతంగా డాక్టరు దగ్గరకు పంపించాను."

నేను వాడివంకే చూస్తూ కూర్చున్నాను. నాకిన్నాళ్ళు తెలిసిన చలపతి వీడు కాదనిపించింది. చలపతికి కూడా జీవితంలో ఒక 'గతం' ఉంటుందని నేను కలలో కూడా అనుకోలేదు.

"చూశావుగా ఆ అమ్మాయిని ?"

"ఆఁ, కొద్దిగా అర్థం కూడా చేసుకో గలిగాను"

"విన్నా వన్నమాట !"

ఏమనాలో తెలియక "ఊఁ" అన్నాను.

"ఆ అమ్మాయి వాళ్ళ ఇల్లు మా ఇంటి వీధిలోనే ! చిన్నతనం నుంచి మా ఇంట్లో మా చెల్లెలితో ఆడుకుంటుండేది. దానికి చదువు చెపుతుంటే కళ్యాణికూడా వచ్చి కూర్చునేది. చిలిపిగా ప్రశ్నలు వేస్తూ, అడిగిన ప్రశ్నలకి వెంటనే సమాధానం చెప్తుండేది. సహజంగా నాకా అమ్మాయంటే ప్రత్యేక మయిన అభిమానం, ఆకర్షణ ఏర్పడ్డాయి. వయస్సుతో పాటు అవీ వృద్ధయాయి.

"వయస్సు వచ్చాక కూడా మా చెల్లెలిని అడ్డం పెట్టుకుని మా ఇంటికి వస్తుండేది. ఎవరూ చూడనప్పుడు మాట్లాడు కుంటుండే వాళ్ళం. అథవా ఎవరయినా చూసినా అట్టే పట్టించుకునే వారు కాదు. అదే నన్ను త్సాహపరిచింది!

"చివరికి కళ్యాణి లేనిదే నా జీవితంలో సంపూర్ణత లేదని గ్రహించాను. ఆనర్సులో ఉండగా కూడా నా పరధ్యానానికి కారణం ధ్యాస ఎప్పుడూ కళ్యాణి మీద ఉండడమే! శలవలు ఇవ్వడం ఆలస్యం ఇంటిదగ్గర వాలేవాడిని. మా చెల్లెల్ని ప్రోత్సహించి దాన్ని సినిమాకి తీసుకెడుతూ కళ్యాణిని కూడా వెంటతీసుకు రమ్మనే వాడిని.

"మా చెల్లాయికి మా ఇద్దరి మధ్య పెరుగుతున్న ఆలోచనలు తెలుసు అది దానికి చాలా ఇష్టం కూడా: తన స్నేహితురాలు తనకి వదినగా వస్తుందని మురిసేది! సినిమాలో మా ఇద్దరినీ ఒక పక్క చేర్చేది. కళ్యాణిని ఆ కాసేపూ 'వదినా' అని పిలిచి ఆ అమ్మాయిని సిగ్గులో ముంచేసేది.

"చివరికి నా పెళ్ళికి ప్రయత్నాలు జరుగుతుండగా చెల్లాయిచేత ఇంట్లో చెప్పించాను — అన్నయ్య 'కళ్యాణిని చేసుకుంటాడుట' అని.

"కాని మా ముగ్గురికీ తోచనిది తోచినా మేము పట్టించుకోనిది ఒక్కటి ఉంది — అది మా మధ్యనున్న కులభేదం. కళ్యాణిది మా కులం కాదు.

"నువ్వా అమ్మాయిని చేసుకున్న

మరుక్షణం భావిల్లో దూకుతా నంది అమ్మ. కుటుంబ ప్రతిష్ట పోయాక బ్రతికేకన్న ముక్కు మూసుకుని హరీ మంటాను అన్నారు నాన్న.

"బ్రతిమాలాను. కళ్యాణి లేనిదే బ్రతకలే నన్నాను.

"కని పెంచిన మమ్మల్ని కాదంటా వన్నమాట. మనకు నిలంకా పిల్లని కోడలుగా తెచ్చుకున్నాక రేపు నీ చెల్లెల్ని ఎవరు చేసుకుంటారు అని బెదిరించారు. పోనీ; మేము పోయినా నువ్వయినా సుఖపడితే అదే పదివేలు అన్నారు ఆఖరు మాటగా!

"తెల్లబోయాను!

"అక్కడ కళ్యాణి సరిగ్గా ఇదే పరిస్థితిని ఎదుర్కొంది. ఇంటిల్లిపాదీ చావ సిద్ధమయారు — సత్యాగ్రహాలు మొదలు పెట్టారు -

"మీ ప్రేమ నిజమయితే దూరంగా ఉండి మనస్సులో ఒకరి నొకరు ఆరాధించుకోండి అన్నారు.

"చివరికి ఆప్తమిత్రులయిన వాళ్ళు కూడా నా ప్రయత్నాన్ని నిరుత్సాహ పరిచారు "రేపు మీకు పిల్లలు పుడతారు. వాళ్ళకి మళ్ళీ ఇటువంటి వాళ్ళనే వెతికి చేయాలి, కాని మంచి కుటుంబంలోని వారెవరూ చేసుకోరు. వాళ్ళ భవిష్యత్తేమవుతుంది? మీ తొందరపాటు వలన చివరికి మీకూ మనశ్శాంతి ఉండదు. మొదటి రోజుల్లోని 'తీపి' అయిపోయాక ఒకరిని చూసి ఒకరు అసహ్యించుకుంటారు. ఒకరికోసం ఒకరు త్యాగం చేశామని తాము చేసిన త్యాగానికి తగ్గట్టుగా అవతలి వాళ్ళు ప్రవర్తించడంలేదని బాధపడతారు. చివరికి మీ వాళ్ళకి ఆనందం ఉండదు మీకూ సుఖం ఉండదు' అన్నారు.

"నాకు తల తిరిగిపోయి కళ్యాణితో 'ఈ పాడు ప్రపంచానికి దూరంగా పోదాం రమ్మ'న్నాను.

"కాని కళ్యాణి కూడా చాలా దూరం ఆలోచించింది. "ఇందరిని కష్టపెట్టి మనం ఈ పని చేయడం కేవలం స్వార్ధమవుతుంది. అంతకన్న మనం స్నేహితుల్లా విడిపోతే వాళ్ళ కోసం ప్రేమని త్యాగంచేసుకున్న సంతృప్తి అయినా ఉంటుంది. కాబట్టి నా మాట విని మీ సంకల్పం మార్చుకుని హాయిగా పెళ్ళి చేసుకోండి" అంది.

"అసలే చుట్టూ వింటున్న మాటలతో బెదిరిపోతున్న నేను కళ్యాణి కూడా అలా అనడంతో నీరు కారి పోయాను.

"అదే సమయమని గ్రహించి మా వాళ్ళు హడావిడిగా ఇందిరా వాళ్ళ సంబంధం వెతికి స్థిరపరిచారు. పెళ్ళి ఈ ప్రాంతంలో అయితే నా ప్రేమ కాండ అంతా వాళ్ళకి తెలిసిపోతుందని తిరుపతిలో చేయమన్నారు... పాపం

"హుం, ఇంత చిన్నవయసులో, మా అమ్మాయికి పెళ్ళి చెయ్యము."

వాళ్ళు ఒప్పుకున్నారు అటునుంచి నేరుగా ఈ ఊరొచ్చి కాపరం పెట్టాము

"కాని నిజం ఏనాటి కయినా తెలియక మానదు. నే నెంతో పవిత్రుడ నని అనుకుంటున్న ఇందిర - ఇప్పటికి కూడా నా హృదయంలో ఒక మ్మాయి చెరగని ముద్ర వేసుకుందని తెలిస్తే ఏమనుకుంటుంది? నన్ను క్షమిస్తుందా ?"

నాకు నవ్వొచ్చింది.

ఇందిర వేసిన ప్రశ్నే చలపతీ వేశాడు. కాని కేవలం తమకొక్కరికే కాదని అవతలివారికికూడా జీవితంలో మాయని మర్చిపోలేని మచ్చలున్నా యని తెలుసుకుంటే ఒకరినొకరు క్షమించుకుంటారా? వాళ్ళహృదయాల్లోని బరువులుతొలిగిపోతాయా అన్న ప్రశ్న నాలోకలిగింది. ఇద్దరి జీవితాలూ తెలిసినవాడినినేను. కాని మంచికిపోయి ఒకరి విషయం ఒకరికి తెలియబరిచితే చక్కబడటానికి బదులు పరిస్తితులు విషమిస్తే! ముఖ్యంగా ఆడది క్షమించగలదు గాని మగవాడు అంతటివిశాల హృదయుడుకాడు ఈ విషయాల్లో. ఇప్పుడు ఒకరినిచూసి ఒకరు జాలిపడుతున్నారు - తామేదో అన్యాయంచేసినట్టు. అప్పుడు తామేదో అన్యాయం చేయబడినట్టు అనహ్యించుకుంటే!

వాళ్ళ జీవితాలమీద ప్రయోగం చేసేంత ధైర్యం నాకులేదు!

ఇందిర రిక్షాదిగిలోపలికిరావడంతో ఆ ప్రసక్తి ఆగిపోయింది.

ఆరోజుసాయంత్రానికిగానిరాలేదు మాధవరావు.

రాగానే "మీ మద్రాను అమ్మాయి మళ్ళీ కనబడిందేమో ననుకుంటు న్నాము" అన్నాడు చలపతి ఆలస్యా నికి కోపం తెలియజేస్తూ.

కొరడాతో కొట్టినట్లు ఉలిక్కి పడ్డాడు మాధవరావు. నేనుఖంగారుగా చుట్టూచూశాను. అదృష్టవశాత్తు ఇందిర గదిలోలేదు.

పొద్దున్ననగా ఇంట్లోంచి పోయి నందుకు మరికాసిని చివాట్లుతిని మాతో బాటు భోజనంచేశాడు మాధవరావు.

రాత్రి పడుకున్నానన్న మాటేగాని నిద్ర పట్టలేదు. ముగ్గురు చెప్పిన రెండు ప్రేమకథలు విన్నాను. అందులో ఒకటి దారుణంగా పేలిపోయింది. భగ వంతుడు సవ్యంగా చూడబట్టిగాని లేకపోతే ఆ విష ఫలితంనుంచి ఇందిర జీవితంలో కోలుకోలేక పతనమయి పోయి ఉండేది. లేదా గుండె దిటవులేని మనిషయితే అంతటితో జీవితాన్ని అంత మొందించుకునేది.

రెండవ ప్రేమకథ — చలపతి, కళ్యాణిలది - నాకు జాలి కలగచేసింది. కారణం వాళ్ళ ప్రేమ ఉదాత్తమయి నది. ఇతరులకోసం, పరువు ప్రతిష్టల కోసం వాళ్ళు విడిపోయారు. కళ్యాణి అన్నట్టు అందులో వారికీ ఒక విధ మయిన ఆత్మ సంతృప్తి ఉంటుంది. అయితే ఒక్క విషయం - వాళ్ళు అందరినీ ఎదిరించి పెళ్ళి చేసుకునుంటే మాత్రం వాళ్ళ జీవితాలు చాలా నికృష్టంగా తయారయేవి. కళ్యాణి చాలా ముందుచూపు కలది. అందంగా ఉంటుంది కూడా.

మగతగా పడుతున్న నిద్రలోంచి చిన్న చప్పుడుతో మెలకువ వచ్చింది. పక్క మంచం మీద మాధవరావు లేడు !

అనుమానం కలిగి వరండాలోకి వెళ్ళి నిలబడ్డాను. నిశ్శబ్దంగా ఉంది. మెల్లిగా దొడ్లోకి వెళ్ళాను. గుడ్డి వెన్నెట్లో ఇద్దరు వ్యక్తులు ఎడ మెడంగా నిలబడి ఉండటం కనబడింది.

"చేసింది చాలక నన్ను సర్వనాశ నం చేద్దామని వచ్చారా ? నేను బ్రతి కుండటం మీకిష్టంలేదా ?" అంటోంది తీక్షణంగా ఇందిర.

"నన్నపార్థం చేసుకుంటున్నావు ఇందిరా! చలపతి చేసుకుంది నిన్నని తెలిస్తే రాకనేపోదును. ఇందాక అటునుంచి అటే పోతానంటే విశ్వం ఆపాడు. 'చలపతికి అనుమానం కలుగు తుంది వెడితే' అని." అది మాధవరావు గొంతు.

కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది.

"నన్ను నమ్ము ఇందిరా - నేను చేసిన పనికి సిగ్గుపడుతున్నాను. బ్రతి కున్నంత కాలం పశ్చాత్తాపపడుతూనే

ఉంటాను. నా జీవితంలో ఇంక శాంతి లేదు నీ కెటువంటి అప కారం చేసేందుకు రాలేదు నేను."

"సర్లెండి, మీరూ నేనూ ఒక ఇంట్లో తిరగడం అసంభవం. రేపు ఉదయం మీరు వెళ్ళకపోతే నేనే నూ పుట్టింటికి వెళ్ళిపోతాను" అని గిరుక్కున వెనక్కి తిరిగి లోపలికి రాబోయినదల్లా నన్ను చూసి ఆగి చిన్నగా నవ్వి—

"అనుమానం వేసిందా అన్నయ్య గారూ?" అంది

"అవును, ఎవరు ఏ అఘాయిత్యం తలపెడతారోనని!"

"రేపు ఈయనగారు ఇల్లు ఖాళీ చేయకపోతే నేనూ మీతో పాటు వస్తాను. మా పుట్టింటిలో దింపండి నన్ను" అంది.

"అలాగే" అని వెళ్ళి పడు కున్నాను. నా వెనకనే మాధవరావు కూడా వచ్చి పడుకున్నాడు

చలపతి లేపడంతో నిద్రలేచాను అప్పటికే బారెడు పొద్దెక్కింది.

"ఏమిటి, మా మాధవుడు చెప్ప కుండా వెళ్ళి పోయాట్ట?!" అనడి గాడు

పక్కనే ఉన్న ఇందిరవంక చూసి "అవునురా, రాత్రి విజయనగరం నుంచి వైరొచ్చింది ఉదయం మెయిల్‌కి వెడతాను, మా వాడికి చెప్పవోయ్ అని చెప్పి రాత్రే వెళ్ళి పోయాడు" అన్నాను.

ఇందిర తలవంచుకుని నిలబడి ఉంది

నేను బయలుదేరు తూంటే "అన్నయ్యగారూ, మీ మేలు జీవి తంలో మరిచిపోలేను" అంది మెల్లిగా ఇందిర

"పిచ్చి పిల్లా, చెల్లెలి కాపరంలో ఒడుదుడుకులు రాకుండా చూడడం అన్నయ్య కర్తవ్యం కదూ—ఎప్పు డయినా పొరపాటున చలపతికి 'ఆ' విషయాలు తెలిస్తే నాకు ఉత్తరం రాయి." అన్నాను.

"తప్పకుండా" అంది నవ్వుతూ

సజల నేత్రాలతో నన్ను సాగ నంపింది!

రైల్లో గడిచిన మూడు రోజులని సింహావలోకనం చేసుకున్నాను ఇద్దరి ద్వారా ఒక కథ విన్నాను మతి మరుపు మనిషి, బద్ధకస్తుడు అనుకున్న చలపతి గతం తెలుసుకుని ఆశ్చర్యపడ్డాను—ఎంతటి త్యాగం చేశాడా అని.

ఆలోచించగా నాకనిపించింది - పైకి చెప్పకపోయినా ప్రతి వ్యక్తి జీవితంలోనూ మరిచిపోలేని గత చరిత్ర, ఆ గతంలో ఒక మచ్చ ఉంటా యేమోనని! నా మట్టుకు నాకు - క్షమించండి, ఇది నన్ను గురించిన కథ కాదుగా.

కథ ఇంకా అయిపోలేదు మరొక్క సంఘటన మిగిలేపోయింది

నేను ఇంటికి చేరుకున్న మూడవ రోజున మా చలపతి దగ్గరనుంచి ఉత్తరం ఒకటి వచ్చింది ఆత్రంగా విప్పిచూశాను అందులో ఇలా వుంది-

డియర్ విశ్వం,

మంచి స్నేహితుడి లక్షణం ఏమిటో తెలుసా - రహస్యాలు దాచకపోవడం నువ్వు నాకు మంచి స్నేహితుడివను కున్నాను ఇన్నాళ్ళూ మా ఇందిర ద్వారా నువ్వువిన్నది నాకుచెబుతా వేమోనని చూశాను కాని చెల్లెలి పక్షమే వహించావుగాని స్నేహధర్మం నెరవేర్చలేదు నువ్వు

ఇందిర గతచరిత్ర నాకు తెలిస్తే మా కుటుంబం ఏమయిపోతుందోనని మధనపడ్డావు - అంతా నేను గమనిస్తూనే ఉన్నాను కాని ఇన్నాళ్ళుగా నన్నెరుగున్న నువ్వు నన్నెందుకు అపార్థం చేసుకున్నావా అని ఆశ్చర్యంగా ఉందినాకు నా మనస్సు అంత సంకుచితమని ఎందుకు అనుమానపడ్డావు ?

మా పెళ్ళయిన కొద్దిరోజులకే ఇందిరని గురించి అందరూ చెప్పారునాకు బహుశా నా దగ్గరనుంచి ఊహించిన మార్పు కనబడలేదు లాగుంది ఆ ప్రయత్నం మానుకున్నారు కాకపోతే ఆ వ్యక్తి మా మాధవుడేనన్న విషయం తెలిసింది మొన్ననే నాకు కావలసింది ఇందిర - ఆమె గతం నాకనవసరం

నీ

చలపతి

నా మీదనుంచి కొండంత భారం దింపినట్లుయింది సమస్యాపరిష్కరించటం చేతకాక తప్పించుకుని వచ్చాను వాళ్ళ ఇంటినుంచి కాని దేముడు అనుకూలించాడు ఇక ఇందిరకి చలపతి జీవితంతో పరిచయంచేసే బాధ్యత మిగిలింది అది ఏమంత కష్టమయినది కాదని తెలుసు నాకు - ఎందుకంటే ఆడది క్షమామూర్తి